www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
12 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 284

# విశాల భారతి
తెలుగు దినపత్రిక



బీజేపీ, బీఆర్ఎస్
## కలిసి కుట్ర
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు
- కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది
- మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం
- సుప్రీంలో అప్పీల్ చేసేందుకు సిద్ధం
- అసలైన ముద్దాయి బీజేపీ
- బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర
- బీసీల ఫలాలను అడ్డుకున్నారు

02




మంత్రుల మధ్య
## టెండర్ల వార్
- తెలంగాణ మంత్రులు మధ్య రచ్చ
- కాంట్రవర్సీకి కేరాఫ్‌గా
- పొన్నం వర్సెస్ అడ్లూరి లక్ష్మణ్
- మంత్రి కొండా సురేఖ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- సీఎంకే ఫిర్యాదు చేశారు
- కాంట్రాక్ట్ పంపకాల్లో తేడాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇష్యూ ఏదైనా..మ్యాటర్ మరేదైనా..తెలంగాణ మంత్రులు ఎప్పుడూ ఏదో ఒక రచ్చతో హాట్ టాపిక్‌గా ఉంటున్నారు. ఒక మంత్రి అయిపోగానే.. మరో మంత్రి.. ఒక్కోసారి ఇద్దరు ముగ్గురు మంత్రులు కాంట్రవర్సీకి కేరాఫ్‌గా నిలుస్తున్నారు. అధిష్టానమో..పార్టీ రాష్ట్ర పెద్దలో..లేకపోతే సీఎం రేవంత్‌రెడ్డో స్వయంగా ఇన్వాల్వ్ అయి ఇష్యూ సెటిల్ చేసే వరకు రచ్చరంబోలా చేస్తున్నారు. ఇలా ఒక వివాదం ముగుస్తుందో లేదో మరో ఇష్యూతో మళ్లీ న్యూస్ హెడ్‌లైన్‌గా మారుతున్నారు తెలంగాణ మంత్రివర్యులు. మొన్నటి వరకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పొన్నం వర్సెస్ అడ్లూరి లక్ష్మణ్ మధ్య దున్నపోతు కామెంట్స్ దుమారం లేపితే.. ఇప్పుడు ఇది వరంగల్‌కు పాకింది. జిల్లా మంత్రి కొండా సురేఖ,

మిగతా 2లో..

టీస్క్వేర్ హైదరాబాద్‌కే
# ఐకానిక్




- ఐటీ కేంద్రంగా హైదరాబాద్ నగరం
- రాయదుర్గం ప్రాంతం
- అత్యంత ఆకర్షణీయంగా టీ-స్క్వేర్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- వివిధ అంశాలపై సమీక్ష
- టీ-స్క్వేర్ ప్రాజెక్టుపై సూచనలు
- నవంబర్ చివరి నాటికి ప్రారంభం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో ఐటీ కంపెనీలకు కేంద్రమైన రాయదుర్గం ప్రాంతంలో అత్యంత ఆకర్షణీయంగా టీస్క్వేర్ నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం రోజున కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఏఐ హబ్, టీస్క్వేర్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన టీస్క్వేర్ ప్రాజెక్టుపై పలు సూచనలు చేశారు. ప్రతిపాదిత టిస్క్వేర్ కోసం శక్తివంతమైన, ప్రత్యేకమైన డిజైన్లను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇది హైదరాబాద్‌కు ఒక ఐకానిక్ నిర్మాణంగా, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఒక ఆకర్షణీయమైన కేంద్రంగా ఉండాలని చెప్పారు. టీస్క్వేర్ పనులు నవంబర్ చివరి నాటికి ప్రారంభమయ్యేలా చూడాలని ఆయన అధికారులను కోరారు. టీస్క్వేర్ నగరంలోనే ఒక ఐకానిక్ భవనంలా ఉండాలని... అందుకు అనుగుణంగా డిజైన్, నిర్మాణంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. టీస్క్వేర్ డిజైన్ పర్యాటకులను ఆకర్షించడం, రెస్టారెంట్లు, వ్యాపారం వంటి అంశాలు పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఆ ప్రాంతం 24 గంటలూ సందర్శకులను ఆకట్టుకునేలా ప్రదేశాన్ని తీర్చిదిద్దాలని తెలిపారు. పెద్ద ఎలక్ట్రానిక్ డిస్‌ప్లేలు, రంగురంగుల డిజిటల్ ప్రకటనల ద్వారా ప్రపంచ స్థాయి డిజిటల్ డిస్‌ప్లే తో రూపొందించాలని చెప్పారు. యాపిల్ లాంటి ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన సంస్థలు అక్కడ వ్యాపారం నిర్వహించేలా ఉండాలి. అలాగే పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాహనాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు ఉండాలని తెలిపారు. వినోదం, సాంస్కృతిక కార్యక్రమాలు, వాణిజ్య

మిగతా 2లో..



## గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్
- మాజీ మంత్రి కేటీఆర్
- జాతీయ వేదికపై మాట్లాడారు
- ఫార్ములా-ఈ రేస్ నిర్వహణ
- అత్యాధునిక సాంకేతికత
- తెలంగాణ సిద్ధంగా ఉంది
- ఎలక్ట్రిక్ కార్ల వీధుల్లో పరుగులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తెలంగాణ ఆవిష్కరణల ప్రస్థానాన్ని జాతీయ వేదికపై చాటిచెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భారతదేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వహించిన ఫార్ములాఈ రేస్ నిర్వహణ గురించి ప్రస్తావించారు. తాము నిర్వహించిన ఫార్ములా ఈ రేసు కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదని, ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణ కేంద్రంగా ప్రపంచ వేదికపై అడుగుపెట్టిందనడానికి ప్రతీక అని కేటీఆర్ స్పష్టం చేశారు. కోయంబత్తూరులో శనివారం జరిగిన 10వ ఎఫ్ఎంఏఈ నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ పోటీలు 2025కి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా,

మిగతా 2లో..

## రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి
- తెలంగాణలో రాజకీయాలు..రసవత్తరంగా మారాయి
- బీసీ రిజర్వేషన్ అంశం.. హైకోర్టు స్టే విధించింది
- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్.. హరీష్ రావు విమర్శలు
- తెలంగాణ ఎడారిలా మారుతుంది

02





## బనకచర్ల అడ్డుకొని తీరుతాం
- తెలంగాణ నీటి ప్రాజెక్టుల అంశం
- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- బనక చర్ల వివాదం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- హరీష్ రావుకి కౌంటర్
- బనకచర్ల అడ్డుకుని తీరుతాం
- ఆల్మట్టి ఎత్తును సమర్థించం


02

## ఈ నెల 14న తెలంగాణ బంద్
- తెలంగాణలో బీసీ రిజర్వేషన్ అంశం
- రాజకీయంగా హాట్ టాపిక్
- ఎలాగైన 42 శాతం రిజర్వేషన్
- సీఎం రేవంత్ రెడ్డి సర్కారు
- ఈ స్టే పై సుప్రీంకోర్టుకు వెళ్లాలి
- బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య
- బంద్‌కు పిలుపునిచ్చారు

02



## సుప్రీంలో సవాల్
**తెలంగాణ బీసీల రిజర్వేషన్‌లు.. పెంచుతూ ప్రభుత్వం విడుదల**



- జీవోలపై హైకోర్టు స్టే
- సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్
- నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ
- సుప్రీంకోర్టుకు ప్రభుత్వం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో బీసీల రిజర్వేషన్‌లు 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోలపై హైకోర్టు స్టే విధించింది. దీంతో స్థానిక సంస్థలక బ్రేక్ పడింది. ఈ విషయంపై సుప్రీం కోర్టులో సవాల్ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఆర్డర్ కాపీ శుక్రవారం అర్ధరాత్రి వచ్చినందు వల్ల దాన్ని పూర్తి స్టడీ చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చిస్తారు.

ఏ పరిస్థితుల్లో ఏ ప్రాతిపదికన, ఎలా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చామో స్పష్టంగా తెలియజేస్తూనే గతంలో వివిధ సందర్భాల్లో వచ్చిన తీర్పులను స్టడీ చేసి ఆ దిశగా సుప్రీంకోర్టు వాదనలు వినిపించనున్నారు. హైకోర్టు స్టే ఎత్తివేసి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేలా అనుమతి ఇవ్వాలని కోరనున్నారు. ముఖ్యమంత్రి సూచనలు తీసుకున్న అధికారులు సోమవారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయనున్నారు.

కొత్తగా తీసుకొచ్చిన రిజర్వేషన్‌తో ఎన్నికల నోటిఫికేషన్ రావడం, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కూడా ప్రారంభమైందని సుప్రీంకోర్టులో వాదించనున్నారు. ఈ పరిస్థితుల్లో హైకోర్టు తీసుకున్న నిర్ణయం సరికాదని తెలియజేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసి అన్ని పార్టీలతో మాట్లాడి అసెంబ్లీ చర్చించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించామని వివరిస్తారు. రాష్ట్రంలో బీసీ జనాభా 57 శాతానికిపైగా ఉందని అందుకే 42 శాతం రిజర్వేషన్ కల్పించడం సబబనే ఉద్దేశంతో జీవో నెంబర్ 9 విడుదల చేశామని వాదించనున్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ప్రభుత్వం కచ్చితంగా సుప్రీంకోర్టు తలుపు తడుతుందని గ్రహించిన పిటిషనర్లు జాగ్రత్త పడ్డారు. జీవో నెంబర్ 9ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేసిన వ్యక్తులే సుప్రీంకోర్టులో కేవియట్ వేశారు. ఈ రిజర్వేషన్ అంశంలో ఎలాంటి ఆదేశాలు

మిగతా 2లో..

# గ్లోబల్ మొబిలిటీ హబ్‌గా హైదరాబాద్

( మొదటిపేజీ తరువాయి )

దేశంలోని యువ ఇంజనీర్లు, ఆవిష్కర్తలను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ.. 'ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఎలక్ట్రిక్ కార్లు హైదరాబాద్ వీధుల్లో పరుగులు తీసినప్పుడు, భవిష్యత్తు కోసం తెలంగాణ సిద్ధంగా ఉందని రుజువైంది. ఈ ఫార్ములా ఈ రేసు దాదాపు రూ. 700 కోట్ల ఆర్థిక కార్యకలాపాన్ని సృష్టించి, అంతర్జాతీయ దృష్టిని హైదరాబాద్ నగరం వైపు మళ్లించింది" అని పేర్కొన్నారు. ఈ ఫార్ములాఈ ఈవెంట్ ఒక ఆరంభం మాత్రమేనని, తెలంగాణ స్థిరమైన, సాంకేతికత ఆధారిత పారిశ్రామిక వృద్ధి లక్ష్యాన్ని కలిగి ఉందని, త్వరలోనే హైదరాబాద్ భారతదేశ మొబిలిటీ వ్యాలీ'గా ఆవిర్భవించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. మోటార్‌స్పోర్ట్స్ అంటే కేవలం వేగం కాదు; అది తమ సామర్థ్యాలను పరీక్షించుకోవడం, హద్దులను ఛేదించడం, ఎంత దూరం వెళ్లగలమో తెలుసుకోవడం అని, జీవితంలో యువత కూడా రేసు కారు మాదిరి దూసుకుపోవాలని కేటీఆర్ అన్నారు.

ఐటీ మంత్రిగా తన హయాంలో, ప్రపంచంలోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన టీహబ్, భారతదేశంలోనే అతిపెద్ద ప్రోటోటైపింగ్ కేంద్రమైన టీవర్క్స్ వంటి సంస్థల ద్వారా తెలంగాణ అంతర్జాతీయంగా



ప్రశంసలు పొందిన ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థను ఎలా నిర్మించిందో కేటీఆర్ వివరించారు. "ఒక ఆలోచన టీహబ్ నుండి టీవర్క్స్‌కు వెళ్లడానికి ఒక టీ తాగేంత సమయం మాత్రమే పడుతుంది" అంటూ ఆలోచన అమలు వేగాన్ని చమత్కరించారు. వందలాది మంది యువ ఇంజనీర్లకు సందేశమిస్తూ, అవకాశాల కోసం ఎదురుచూడకుండా, వాటిని మీరే సృష్టించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. "మీరు సొంతంగా ఒక క్యూను సృష్టించగలిగినప్పుడు, ఇతరులు ఏర్పాటు చేసిన క్యూలో ఎందుకు నిలబడాలి?" అని ప్రశ్నించారు. "ఉద్యోగాలు వెతికేవారుగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చేవారుగా మారండి. మీరు పెద్ద కలలు కనడం ప్రారంభించిన తర్వాత, మీ సొంత సామర్థ్యాన్ని చూసి మీరే ఆశ్చర్యపోతారు" అని ఆయన ఉద్బోధించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ప్రయాణాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. ఒకప్పుడు రాష్ట్ర ఏర్పాటు సాధ్యం కాదని చాలామంది సందేహించారని, కానీ, "ఇప్పుడు 11 సంవత్సరాల తర్వాత, అనేక రంగాలలో దేశానికి ఆదర్శంగా నిలబడ్డాము. తెలంగాణ సాధించిన ప్రగతి విశ్వాసానికి పట్టుదలకు దర్శనీకత నిదర్శనం అన్నారు. నేటి యువతరం, జెన్ జీ కు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తూ, కేటీఆర్... ఆదాయం కంటే ప్రభావానికి, అధికారం కంటే ప్రామాణికతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వేగం, విస్తరణ పట్ల ఆకలిని కలిగి ఉండాలని సూచించారు. మీరు ఇతరులు అనుకున్నదాని కంటే తెలివైనవారు, బాధ్యత కలిగినవారు. భారతదేశాన్ని ముందుకు నడిపించేది మీరే" అని విద్యార్థులకు తెలిపారు. మోటార్‌స్పోర్ట్స్ అయినా, పాలన అయినా, జీవితంలో అయినా విజయం కేవలం యాదృచ్ఛికంగా రాదని, "మనం అవకాశాలను రూపొందించుకోవాలి, ధైర్యంతో అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్తు ఉంటుందని" కేటీఆర్ స్పష్టం చేశారు.

# బనకచర్ల అడ్డుకొని తీరుతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రస్తుతం నీటి ప్రాజెక్టుల అంశంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ ల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఒకరిపై మరోకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు.ఈ నేపథ్యంలో తాజాగా.. బనక చర్ల వివాదంలో బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ పార్టీపై, రేవంత్ రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో దీనికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన దైన స్టైల్ లో కౌంటర్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టు పై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీష్‌రావు చేసిన ఆరోపణల్ని ఖండించారు. ఎట్టిపరిస్థితుల్లో కూడా.. బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. దీన్నిన నిర్మాణానికి ఒప్పుకునే ప్రసక్తే లేదన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బనకచర్లను అడ్డుకుంటుందన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ .పాటిల్ కు స్వయంగా కలవడంతో పాటు లిఖితపూర్వకంగా తెలంగాణా అభ్యంతరాలను తెలియ పరిచినట్లు తెలిపారు. అదే విధంగా.. ఆల్మట్టి ఎత్తును సమర్థించే ప్రసక్తే లేదన్నారు. పొరుగున కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. హరీష్‌రావు మాటల్లో ఒక్కటి కూడా నిజం లేదన్నారు. కృష్ణా,గోదావరి జలాశయాలలో తెలంగాణాకు నష్టం జరిగిందంటే.. దానికి పూర్తిగా బీఆర్ఎస్ పార్టీ కారణమన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీతిమంత్రి హరీష్ రావులు కృష్ణా జలాశయాలలో ఆంధ్రప్రదేశ్ కు 512 టి.యం.సి నీటి వినియోగానికి ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ కు 512 టి.యం.సి లు తెలంగాణా కు 299 టి.యం.సి ల నీటి కేటాయింపులు అంటూ లిఖిత పూర్వకంగా ఒప్పుకుంది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.



కృష్ణా, గోదావరి జలాశయాలలో తెలంగాణాకు నష్టం జరిగింది అంటే అది పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే అని అన్నారు. కృష్ణా జలాశయాలలో తెలంగాణాకు న్యాయంగా రావాల్సిన నీటి వాటపై ట్రిబ్యునల్ ఎదుట సమర్ధవంతంగా వాదనలు వినిపించామన్నారు. స్వయంగా నీటిపారుదల శాఖామంత్రి హోదాలో తాను ట్రిబ్యునల్ ఎదుట హాజరయ్యానని వివరించారు. నీటి వివాదంలో ట్రిబ్యునల్ ఎదుట హాజరైన మంత్రి ఎవరైనా ఉన్నారు అంటే అది ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రమేనని తెల్చి చెప్పారు.

కృష్ణా జలాశయాలలో 70శాతం తెలంగాణా వాటా సాధించేందుకు గట్టిగా పట్టు పడుతున్నమన్నారు. ఇన్ని వాస్తవాలను వక్రీకరించి రాజకీయ దురుద్దేశంతో హరీష్ రావు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రజలు నిజ నిజాలను గమనిస్తున్నారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కట్టిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం కుప్ప కూలిందన్నారు. మెడిగడ్డ కూలిపోయిందన్నారు. అదే విధంగా.. సుందిళ్ల, అన్నారం బ్యారేజీ లకు పొక్కలు పడి నిరుపయోగంగా మారాయన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ నిర్మిస్తామన్న బీఆర్ఎస్ పాలకులు తట్టెడు మట్టి ఎత్తలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారినా ధాన్యం దిగుబడిలో అరుదైన రికార్డ్ నమోదు అయిందన్నారు. 148.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి భారతదేశ చరిత్రలోనే రికార్డు సృష్టించిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు అయిన మూడు పంటలు దిగుబడిలో అధిక ఉత్పత్తి సాధించిన తీరు ప్రభుత్వ పనితీరును ప్రతిబింబిస్తుందన్నారు. కృష్ణా,గోదావరి జలాశయాలలో తెలంగాణా వాటా సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెల్చి చెప్పారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకుందన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. తమ్మిడిహట్టి వద్ద చేవెళ్లప్రాణహిత ప్రాజెక్టు కట్టి తీరుతామన్నారు. సమ్మక్కసారక్క ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అనుమతులు సాధిస్తున్నామన్నారు. సీతారామ ప్రాజెక్టు కు 65 టి.యం.సి ల నీటి కేటాయింపులు సాధించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. హరీష్ రావు అనుచిత వ్యాఖ్యాలు, అసత్యప్రచారంతో ప్రజల్లో గందరగోళం సృష్టించవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ స్పష్టం చేశారు.

# ఈ నెల 14న తెలంగాణ బంద్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రస్తుతం తెలంగాణలో బీసీ రిజర్వేషన్ అంశం రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.ఈ క్రమంలో బీసీలకు ఎలాగైన 42 శాతం రిజర్వేషన్ లు ఇచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సర్కారు తర్జన భర్జనలు పడుతుంది. ఈ క్రమంలో హైకోర్టు ఇప్పటికే దీనిపై స్టే విధించింది. ఈ స్టే పై సుప్రీంకోర్టుకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తుందని వార్తలు వస్తున్నాయి. మరోవైపు బీసీ సంఘాలు మాత్రం దీనిపై చాలా సీరియస్ గా ఉన్నాయి. ఈ క్రమంలో బీసీలకు రిజర్వేషన్ ల సాధనే టార్గెట్ గా తమ పోరాటం సాగుతుందని ఎంపీ ఆర్. కృష్ణయ్య తెల్చి చెప్పారు. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ ఈ నెల 14న తెలంగాణ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య తెలిపారు. ఈ బంద్ కు అన్నిపార్టీలు, బీసీ సంఘాలు మద్దతివ్వాలని కోరారు. ఈక్రమంలో బీజేపీ కార్యలయంలో వెళ్లి.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. బంద్ కు తమతో పాటు కలిసి రావాలని కోరారు. ఈ విషయంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వారు తనకు తెలియజేశారని ఆర్. కృష్ణయ్య పేర్కొన్నారు. మరోవైపు.. ఈ అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దీన్ని నిరసిస్తూ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చామని అన్నారు. 22 బీసీ సంఘాలు సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

నామినేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యే సమయంలో హైకోర్టు స్టే విధించడం సరికాదని అన్నారు. బీసీల నోటి కాడి కూడును లాక్కున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అసెంబ్లీలో బీజేపీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు. ఇది బీసీల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని, దీనికోసం ఎంతదూమైన వెళ్తామని, బీసీల సత్తా చూపిస్తామని కూడా ఎంపీ ఆర్. కృష్ణయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు. సుప్రీంకోర్టు నిబంధనలు, తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిన జీవో.. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని.. జీవో నెంబర్ 9పై స్టే విధించింది. జీవో నెంబర్ 9 ప్రకారమే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది కాబట్టి, నోటిఫికేషన్ మీద కూడా స్టే కొనసాగుతుందని స్పష్టం చేసింది. 50 శాతం మించి రిజర్వేషన్ల పెంపునకు సరైన కారణాలు ఉన్నాయని రవివర్మ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక పరిస్థితుల్లో రిజర్వేషన్లు పెంచుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు న్యాయవాది రవివర్మ. హైకోర్టు ఆదేశాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించింది. కోర్టు స్టే ఆర్డర్ పరిశీలించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం ప్రకటిస్తామంది. "ఏ జీవో నెంబర్ 9 ద్వారా అయితే ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిందో దాన్ని చాలెంజ్ చేస్తూ పిటిషన్లు వేయడం జరిగింది. ఆ జీవోని కోర్టు స్టే చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ను జీవో నెంబర్ 9 ఆధారంగా ఇచ్చారు. జీవో నెంబర్ 9పై కోర్టు స్టే విధించడంతో నోటిఫికేషన్ పైన కూడా స్టే విధించినట్లు అవుతుంది" అని న్యాయవాదులు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రేవంత్ సర్కార్ జీవో తెచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రభుత్వం ఇచ్చిన జీవోను (42 శాతం రిజర్వేషన్లు) వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన కోర్టు.. జీవో నెంబర్ 9పై స్టే విధించింది. కోర్టు ఆదేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుంది అనేది ఆసక్తికరంగా మారింది.

# రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో ప్రస్తుతం రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఒకవైపు బీసీ రిజర్వేషన్ అంశంపై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. దీనిపై ఏ విధంగా ముందుకు వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ తర్జన భర్జనలు పడుతుంది. మరోవైపు బీఆర్ఎస్ కాంగ్రెస్ ను ఎక్కడ దొరికిన కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని విమర్శలు ఎక్కిపెట్టింది. దీంతో ప్రస్తుతం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ ల మధ్య మాటల యుద్ధం పీక్స్ కు చేరింది. ఇటీవల పెంచిన బస్సు చార్జీలపై కూడా బీఆర్ఎస్ కాంగ్రెస్ పై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరోసారి మాజీ మంత్రి హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. హరీష్ రావు మాట్లాడుతూ.. "రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు... నల్లమల పిల్లి" అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పొరుగున ఉన్న రాష్ట్రాలు కృష్ణా, గోదావరి జలాలను తరలించుకుని పోతున్నాయన్నారు. రేవంత్ రెడ్డి మాత్రం తెలంగాణ ప్రయోజనాల్ని కాపాడటంతో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు.ఇటీవల రేవంత్.. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ఇటీవల కర్ణాటకకు వెళ్లిన రేవంత్ రెడ్డి, అక్కడి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌తో ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు అంశంపై ఎందుకు మాట్లాడలేదని హరీశ్ రావు ఏకిపారేశారు. ఆల్మట్టి డ్యామ్ వల్ల తెలంగాణ ఎడారిలా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

సొంత పార్టీ అధికారంలో ఉన్న మరో రాష్ట్రంకు.. రేవంత్ రెడ్డి కనీసం కూర్చుని మాట్లాడి సమస్య పరిష్కరించలేని స్థితిలో ఉన్నారన్నారు. కనీసం రాహుల్ గాంధీతో అయిన మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం కోసం చొరవ చూపలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కేవలం ఢిల్లీకి బ్యాగులు మోయడమే కాదని, కానీ తెలంగాణ బాగోగులను కూడా పట్టించుకోవాలని సెటైర్ లు వేశారు. ముఖ్యంగా.. ఏపీ 463 టీఎంసీలు, కర్ణాటక 112 టీఎంసీలు, మహారాష్ట్ర 74 టీఎంసీల నీటిని ఆపుకుంటే మన పరిస్థితి ఏంటి? కింద గోదావరి, పైన కృష్ణా నీళ్లు వాళ్లు తీసుకుపోతే మనతెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. తరచూ తనను తాను 'నల్లమల బిడ్డ' అని చెప్పుకునే తిరిగే రేవంత్ రెడ్డి.. కనీసం నల్లమలను ఆనుకుని ప్రవహించే కృష్ణా నదికి, మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరుగుతుంటే ఏంచేస్తున్నారని మండిపడ్డారు. అందుకే రేవంత్.. నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా?.. అంటూ ఏకిపారేశారు. ఒక వేళ పులి అయితే గర్జించేవాడివి. పిల్లివి, ఎలుకవు కాబట్టే మౌనంగా ఉన్నావంటూ హరీష్ రావు ఏకిపారేశారు.

# సుప్రీంలో సవాల్

( మొదటిపేజీ తరువాయి )

ఇచ్చే ముందు తమ వాదన వినాలని అభ్యర్థించారు. అంటే ఇప్పుడు ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసినా.. వారు కూడా వాదనలు వినిపిస్తారు. తెలంగాణలో రాజకీయంగా బీసీలకు ఉన్న రిజర్వేషన్‌ను 42 శాతానికి ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు జీవో నెంబర్ 9ను విడుదల చేసింది. అయితే అసెంబ్లీలో ఆమోదించిన రిజర్వేషన్ పెంపు బిల్లు ఇంకా గవర్నర్ వద్దే ఉంది. ఆయన ఆమోదం పొందలేదు. ఇంతలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతారా లేదా అని హైకోర్టు వేరే కేసులో ప్రశ్నించే సరికి ప్రభుత్వం జీవో నెంబర్ 9 తీసుకొచ్చి బీసీల రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచింది. హైకోర్టు ఇచ్చిన గడువు కంటే ఒక రోజు ముందు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. రెండు రోజుల క్రితం తొలి విడత నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. అయితే 42 శాతం రిజర్వేషన్ వ్యతిరేకిస్తూ కొందరు వ్యక్తులు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీన్ని విచారించిన హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 9 పై స్టే విధించింది. స్థానిక సంస్థల ఎన్నికలు జరిపేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పింది. అయితే కొత్త రిజర్వేషన్ల ప్రకారం కాకండా పాత పద్ధతిలోనే వెళ్లాలని చెప్పేసింది.

# మంత్రుల మధ్య టెండర్ల వార్

( మొదటిపేజీ తరువాయి )

ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య వార్ హాట్ టాపిక్ అవుతోంది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ..జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై ఏకంగా సీఎంకే ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇదంతా సరే కానీ..అసలు వివాదం ఎక్కడ వచ్చిందనే కదా డౌట్. మేడారం జాతర పనుల టెండర్ల కేటాయింపు ఈ ఇద్దరి మధ్య లొల్లిని రాజేసిందట.

వచ్చే ఏడాది జరిగే మేడారం జాతర కోసం ప్రభుత్వం పనులు చేపడుతోంది. పైగా ఇటీవల సీఎం రేవంత్రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా మంజూరు చేసిన పనులు కూడా చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మేడారంలో చేపట్టబోతున్న అభివృద్ధి పనుల టెండర్ల విషయంలో కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి మధ్య విబేధాలు వచ్చాయట. కొండా సురేఖ దేవాదాయ శాఖ మంత్రి. పైగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ జిల్లా ఇంఛార్జ్ మంత్రిగా ఉన్నారు.

అయితే దేవాదాయశాఖకు చెందిన ఓ టెండర్‌ను పొంగులేటి తన మనిషికి ఇప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కొండా వర్గం ఆరోపిస్తోంది. తన శాఖలో ఆయన జోక్యమేంటని ప్రశ్నిస్తూ సీఎంతో పాటు పార్టీ అగ్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు కొండా మురళి కూడా మంత్రి పొంగులేటి తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లాలో సదరు మంత్రి పెత్తనం ఏంటని ప్రశ్నించడమే కాదు___ పొంగులేటిపై కాంగ్రెస్ అధిష్టానంకు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.మంత్రుల మధ్య టెండర్ల వార్ తెరపైకి.. మేడారం మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా కొనసాగుతున్న పనులను మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, సీతక్క పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలోనే మంత్రుల మధ్య టెండర్ల వార్ తెరపైకి రావటంతో పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఈ ఇద్దరు మంత్రుల మధ్య పంచాయితీ వెనుక మరో కారణం కూడా ఉందన్న టాక్ వినిపిస్తోంది. కాంట్రాక్ట్ పంపకాల్లో తేడాలవల్లే విషయం రచ్చకెక్కిందనే టాక్ నడుస్తోంది.

తన జిల్లాలో..పైగా తన శాఖలో జరిగే పనుల్లో పొంగులేటి జోక్యం ఏంటని సన్నిహితుల దగ్గర కొండా సురేఖ వాపోతున్నారట. ఇదే విషయంలో అంతర్గత పోరు కాస్త ఇప్పుడు రచ్చకెక్కినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మధ్యే మంత్రి పొన్నం చేసిన దున్నపోతు కామెంట్స్‌పై పెద్ద దుమారమే లేచింది. దళిత సంఘాలు, మంత్రి అడ్లూరి డిమాండ్‌తో పెద్ద రచ్చ అయింది. దీంతో పీసీసీ చీఫ్ ఇద్దరు మంత్రులతో మాట్లాడి.. పొన్నంతో క్షమాపణ చెప్పించి..అందరూ కలిసి టిఫిన్ చేసి ఇష్యూ సమసిపోయినట్లు చెప్పుకొచ్చారు. ఆ ఇష్యూ అలా చల్లబడ్డదో లేదో ఒక్క రోజు గ్యాప్లోనే మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ వార్ వెలుగులోకి వచ్చింది. మరి ఈ వివాదానికి పార్టీ పెద్దలు, సీఎం రేవంత్ ఎలా ఫుల్ స్టాప్ పెడుతారో చూడాలి మరి.

# బీజేపీ, బీఆర్ఎస్ కలిసి కుట్ర

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మరోసారి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల జీవో, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీల్ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అక్కడ వెసులు బాటు దొరుకుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు.

గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్ లో ఉంచారని.. గవర్నర్ ను నియమించేది ఎవరు? అని ప్రశ్నించారు మహేశ్ గౌడ్. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సిందంతా చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు.

రాయలసీమను రతనాల సీమ చేస్తా అన్నది కేసీఆర్ కాదా? అని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు మహేశ్ గౌడ్. అధికారంలోకి వచ్చాకా కాంగ్రెస్ అడ్డుకునేందుకు ఫిర్యాదు చేసిందని చెప్పుకొచ్చారు. తెలంగాణకు దక్కాల్సిన ఒక్క నీటి చుక్కను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. మంత్రుల మధ్య విభేదాలు అన్ని సర్దుబాటు చేసుకుంటామని వివరించారు. ఆర్ఓబీ నిర్మాణాల కోసం కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందని.. కేంద్రం నిధులు రాకపోవటం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని చెప్పుకొచ్చారు.

ఇక తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వివరాలు... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. నిన్న, ఈరోజు బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై స్టే విధించింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ఇందుకు సంబంధించి ప్రభుత్వం నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఆ తర్వాత రెండు వారాల పాటు పిటిషనర్లు తమ సమాధానాలను దాఖలు చేయాలని తెలిపింది. ఆ తర్వాత బీసీ రిజర్వేషన్ల అంశంపై విచారణ చేపట్టనున్నట్టుగా తెలిపింది. దీంతో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. తెలంగాణ ఎన్నికల సంఘం ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం... ఈరోజు తొలి విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఎన్నికలపై, జీవో నంబర్ 9పై స్టే విధించింది.





# టీ స్క్వేర్ నగరానికే ఐకానిక్

( మొదటిపేజీ తరువాయి )

కార్యకలాపాలతో పాటు కార్పొరేట్ అవసరాలకు అనుగుణంగా టీస్క్వేర్ రూపుదిద్దుకోవాలని సూచించారు. అలాగే హైదరాబాద్ లో ఒక AI (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న AI ప్రాజెక్టులు, స్టార్టప్‌లు, సెంటర్లను ఒకే చోట కలిపి ప్రపంచ AI కంపెనీలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ హబ్‌లతో భాగస్వామ్యం చేసేందుకు ఈ హబ్ ఉపయోగపడాలని స్పష్టం చేశారు. 2024 నుంచి తెలంగాణను ఏఐకి ప్రముఖ ప్రపంచ గమ్యస్థానంగా ఉంచాలనే పెద్ద లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం అనేక ఇన్షియేటివ్స్ చేపట్టిందని తెలిపారు. 2024 సెప్టెంబర్‌లో గ్లోబల్ ఏఐ సమిట్ జరిగిందని, ఏఐ సిటీ ప్రాజెక్ట్ ప్లాన్ ప్రకటించబడిందని గుర్తుచేశారు. తెలంగాణ ఏఐ రైజింగ్ గ్రాండ్ ఛాలెంజ్ నిర్వహించబడిందని కూడా తెలిపారు.

# ఊపందుకున్న లిక్కర్ షాప్ దరఖాస్తులు




- జిల్లాలో 57 దరఖాస్తులు
- స్టేషన్ పరిధిలోనే 34 రికార్డు

**మహబూబాబాద్, విశాలభారతి:**

జిల్లాలో లిక్కర్ షాప్ లైసెన్స్‌ల కోసం వ్యాపార వర్గాలు పోటీ పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మద్యం దుకాణాల అనుమతులకు ఆన్‌లైన్ లో దరఖాస్తు ఫారంలను ఉంచగా మహబూబాబాద్ జిల్లాలో ఊహించని రీతిలో స్పందన లభిస్తోంది. శనివారం ఒక్క రోజే 34 దరఖాస్తులు అందగా, ఇప్పటివరకు మొత్తం జిల్లాలో 57 దరఖాస్తులు సమర్పించబడ్డాయని ఎక్సైజ్ సీఐ జి. చిరంజీవి తెలిపారు. ముఖ్యంగా మహబూబాబాద్ స్టేషన్ పరిధిలో 21 కొత్త దరఖాస్తులు అందాయి. దీంతో ఆ పరిధిలో మొత్తం దరఖాస్తుల సంఖ్య 34కు చేరింది.గత లైసెన్స్ కాలంలో మంచి ఆదాయం సాధించిన వ్యాపారులు మళ్లీ దరఖాస్తులు సమర్పించగా, కొత్తగా ప్రవేశించాలనుకునే వారు కూడా పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది అని పేర్కొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్



**రాజేంద్రనగర్, విశాల భారతి:**

రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి శనివారం పరిశీలించారు. సాధారణ పరిశీలనలో భాగంగా ఆయన క్షేత్రస్థాయిలో గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీల్‌ను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును సమీక్షించారు. అలాగే గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహశీల్దార్, వేర్‌హౌస్ ఇంచార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు మరియు సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## హస్తినాపురం జెడ్పి రోడ్డు మీదుగా బస్సులను నడపాలి

**కార్పొరేటర్ సుజాత నాయక్**

**ఎల్బీనగర్, విశాలభారతి:**

బి.యన్.రెడ్డి నగర్ చౌరస్తా నుండి హస్తినాపురం జెడ్పి రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులను నడిపే విధంగా కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్ తెలిపారు. శనివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి 277 నెంబర్ బస్సును జెడ్పి రోడ్డు రూట్లో నడపాలని కోరిన వెంటనే సంబంధిత అధికారులను బస్సును నడిపే విధంగా ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సానుకూలంగా స్పందించినందుకు



రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదాలు తెలిపారు. జెడ్పి రోడ్డు నుండి బస్సు సౌకర్యం లేక అనేక కాలనీల వాసులు విద్యార్థులు ఉద్యోగులు వివిధ పనులపై వెళ్లేవారు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆమె తెలిపారు. మంత్రిని కలిసి విన్నవించినట్లు తెలిపారు.

# కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం



**మంత్రి శ్రీధర్ బాబు**

**ఎల్బీనగర్, విశాలభారతి:**

అమెరికాలో దుండగుడి కాల్పుల్లో మరణించిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ పార్థివ దేహం శనివారం తెల్లవారుజామున బి.ఎన్.రెడ్డి నగర్ టీచర్స్ కాలనీ లోని వారి నివాసానికి చేరుకున్నాక రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ దుద్దిల్ల శ్రీధర్ బాబు , ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, చంద్రశేఖర్ పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున ఐదు లక్షల ఎక్స్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఉన్నత చదువుల కోసం ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన చంద్రశేఖర్ ను కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న చంద్రశేఖర్ అర్థాంతరంగా మరణించడం చాలా బాధాకరమన్నారు. చంద్రశేఖర్ పార్థివ దేహాన్ని తీసుకురావడానికి రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని విధాల ప్రయత్నాలు చేసిందన్నారు. అమెరికాలోనే ఉన్న ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ కూడా తగిన కృషి చేశారన్నారు.ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందని, చంద్రశేఖర్ ఇద్దరు సోదరులకు కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామన్నారు. మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వపరంగా ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఎక్స్రేషియా ఇవ్వడంతో పాటు వారి కుటుంబ సభ్యులు ఏదైనా వ్యాపారం పెట్టుకునేందుకు ముందుకు వస్తే ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూ. ఐదు లక్షల వరకు రుణం కూడా ఇప్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి,ముద్దగోని రామ్మోహన్ గౌడ్, ధర్పల్లి రాజశేఖర్ రెడ్డి, దిండి శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎఫ్ హెచ్ సి యుహెచ్ సి యు ఆధ్వర్యంలో

# మీడియా క్యాపిటల్ పుస్తకావిష్కరణ

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని బహుజన్ స్టూడెంట్స్ ఫ్రంట్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ పంతుకల శ్రీనివాస్ రచించిన మీడియా క్యాపిటల్ అనే పుస్తక ఆవిష్కరణ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు, మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, రిటైర్డ్ ఐపీఎస్ ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ పూర్ణచంద్రరావు, బహుజన స్టూడెంట్స్ ఫ్రంట్ ప్రొఫెసర్ వినోద్ పావురాల అధ్యక్షతన పి.శ్రీనివాస్ మీడియా కాపిటల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.పివి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పుస్తకం ప్రస్తుత సమాజంలో మీడియా యొక్క వైఖరిని రాజకీయ పార్టీల విధానాల్ని చాలా చిన్నంగా అర్థం చేసుకోవడం కోసం మీడియా క్యాపిటల్ ఉపయోగపడుతుంది. ఏ సమాజానికి మీడియా కొమ్ముకాస్తుంది, ఎవరి ప్రయోజనాలకోసం తోడ్పడుతుందో రచయిత చాలా చక్కగా వివరించారని చెప్పుకొచ్చారు. మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ దేశంలో బహుజనులకు ప్రత్యేకంగా ఎలాంటి మీడియా లేకపోవడం చాలా దురదృష్టకరమని, కానీ సోషల్ మీడియా ప్రభావం వల్ల చాలావరకు ప్రభుత్వాలు రాజకీయ పార్టీలు చేస్తున్నటువంటి మోసాలను ప్రజలను మభ్య పెట్టే విధానాలను సామాన్యుడు సైతం తెలుసుకునేలా సోషల్ మీడియా ప్రజలకు చేరుతుంది. దేశంలోని అన్ని రాజకీయ పార్టీల యొక్క విధి విధానాలను మీడియా అందరికి న్యాయమైన, సమానమైన విలువలను బోధించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. డాక్టర్ పూర్ణచంద్రరావు గారు పుస్తకాన్ని పరిచయం చేస్తూ నూటికి 85 శాతం ఉన్న జనం రాజ్యంలోకి రావాలంటే మీడియా పాత్ర చాలా ప్రధానమైందని మీడియా లేకపోతే నాయకులు వారి యొక్క ఎజెండాలు, కార్యకలాపాలు ప్రజలకు చేరువయే అవకాశం తక్కువగా ఉంటుంది కాబట్టి పి. శ్రీనివాస్ చేసినటువంటి సాహసం మామూలుది కాదు ఇది యావత్ బహుజన సమాజానికి చాలా దగ్గరగా ఉంటూ వారు ప్రత్యేకంగా తన అనుభవాలను, బహుజన రాజ్యం దిశగా అడుగులు వేస్తూ మీడియా క్యాపిటల్ ను రచించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ అధ్యక్షులు అంజి ఎర్రోళ్ల, కన్వీనర్ జోగు రమేష్, అసుర పరశు, ఉపాధ్యక్షులు దివాకర్, రచన, ఆశ్చర్య, ప్రధాన కార్యదర్శి ముద్ధం నవీన్, ప్రసన్న, త్రివేణి, జగదీష్, మోహన్, సుస్మిత, శ్యామ్, నిరీక్షణ, సాయి కుమార్, అరవింద్, అనిల్, సుధాకర్, గౌతం, అశోక్,బిఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# రాష్ట్ర జిల్లా అధ్యక్షుల నియామక పత్రాల స్వీకరణ

**జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి**

**కూకట్ పల్లి, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రంలో జిల్లా అధ్యక్షులు నియామకం కోసం ఏఐసీసీ ప్రక్రియ ప్రారంభించింది.ఈ మేరకు పార్టీ అధినాయకత్వం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఏఐసీసీ అబ్జర్వర్ గా అంజలి నిమ్బల్కర్ ను నియమించింది. అంజలి అధ్యక్షతన శనివారం మేడ్చల్ జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ హాజరయ్యారు. ఆశావహుల నుంచి అంజలి దరఖాస్తులను స్వీకరించారు.దరఖాస్తుల పరిశీలన అనంతరం అభ్యర్థుల సీనియారిటీ, సిన్సియారిటీ నిజాయితీ మేరకు అర్హులైన వారిని జిల్లా అధ్యక్షులుగా నియమించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. జిల్లా నాయకులతోను ఆమె ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

# పెండ్లైన మహిళ మిస్సింగ్

**దర్యాప్తు చేస్తున్న నేరెడ్మెట్ పోలీసులు**

**నేరెడ్మెట్, విశాలభారతి,:**

రెండు నెలల క్రితం పెండ్లైన ఓ మహిళ కనిపించకుండా పోయిన ఘటన నేరెడ్మెట్ పోలిస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జేజే నగర్ లో చిన్నబయిన ప్రశాంత్ కు హరీష (21)తో రెండు నెలల క్రితం వివాహం జరిగింది. అయితే గురువారం రాత్రి 10 గంటల ప్రాంతంలో హరీష కనిపించకుండా పోయింది. దానితో ప్రశాంత్ తో కుటుంబ సభ్యులు చుట్టు ప్రక్కల కాలనీలు, పరిశీలించి, ఫ్రెండ్స్ ని, బంధువులను ఆరాతీశారు. అయినా ఆమె ఆచూకి తెలియకపోవడంతొ హరీష కనిపించడం లేదని భర్త ప్రశాంత్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# యువతి అదృశ్యం




**మేడిపల్లి, విశాలభారతి:**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విజయపురి కాలనీలో నివసించే బాపురెడ్డి పెద్ద కుమార్తె అయిన బి. కావ్య వయసు 21 సంవత్సరాలు రెండు నెలల నుండి మల్లాపూర్ లోని ఒక కంపెనీలో పనిచేస్తూ ఉన్నది 9.10.2025 గురువారం నాడు ఉదయం ఎనిమిది గంటలకు డ్యూటీ కి అని చెప్పి ఇంట్లో కావ్య తిరిగి ఇంటికి రాకపోయేసరికి బాబు రెడ్డి మేడిపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించారు. యువతి ఎవరికైనా కనిపించిన మేడిపల్లి పోలీస్ వారికి సమాచారం ఇవ్వగలరు.

# గౌతమ్ రావును కలిసిన రవి ప్రసాద్ గౌడ్

**సికింద్రాబాద్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శిగా ఎన్. గౌతమ్ రావు నియమితులయ్యారు. శని వారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా వారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కలిసిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి ప్రసాద్ గౌడ్. బౌద్ధ నగర్ బిజెపి అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్. అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ దత్తు, జయంత్ తదితరులు ఉన్నారు.



## డబల్ బెడ్ రూమ్ ఇండ్లు

# ఇచ్చేవరకు పోరాటం ఆగదు



**సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండీ యాకుబ్**

**తొర్రూర్, విశాలభారతి:**

తొర్రూర్ లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పేదలకు పంచాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అధికారులు నిలబెట్టుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్, ఎండి యాకుబ్ అధికారులను డిమాండ్ చేశారు.తొర్రూరు మండల కేంద్రంలో గోపాలగిరి రోడ్డు లో నిర్మించిన 284 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు పంచాలని సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్ అనంతరం రెండో విడత డబల్ బెడ్ రూమ్ ల దగ్గర లబ్ధిదారులందరితో కలిసి నిరసన తెలియజేయడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ తోరూర్ పట్టణ కార్యదర్శి కొమ్మనబోయిన యాకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్, తొర్రూరు మండల కార్యదర్శి ఎండీ యాకుబ్ లు మాట్లాడుతూ, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంచేవరకు పోరాటం ఆగదని, అధికారుల మాట ప్రకారం ఎన్నికల కోడ్ తర్వాత అని హామీ ఇచ్చిన హామీని అధికారులు లబ్ధిదారులకు ఇల్లు పంచి మాట నిలబెట్టుకోవాలని వారు అధికారులను డిమాండ్ చేశారు. డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం పూర్తయి సరైనటువంటి రక్షణ లేక శిధిలావస్థకు చేరుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్లు పూర్తయి సుమారు నాలుగు సంవత్సరాలు పూర్తి అయినా కూడా ఇండ్లు పంచడం లేదని, కాంగ్రెస్ హయాంలోనైనా ఇండ్లు పంపిణీ చేస్తారా లేదో అని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు డోనుక దర్గయ్య, జమ్మల శ్రీను, రవి, సోమయ్య, అమీర్, పంపన శోభ, ఎడ్ల ధర్మయ్య, సాయిలు, వరలక్ష్మి, శ్రీలత, షమీన, అరుణ,అమీనా, గుజ్జ రేణుక, భవాని నాగమణి రాధ, రేవూరి శ్రీను, అఖిల్, బండి వసంత, మంగళపల్లి కృష్ణ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం



**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలంలోని కామారెడ్డి గూడెం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ సావిత్రి ఆధ్వర్యంలోపోషణ మాసం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రం లో తల్లులకు పిల్లలకు అందించే పోషక ఆహారం మంచి పోషకాలతో ఉండాలి కేంద్రం చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఉప్పు, చెక్కరి, నూనె, వాడకం తగ్గించాలి, మరియు ప్రతి కేంద్రంలో పోషణ వాటిక ఏర్పాటు చేసి ఆకు కూరలు కూరగాయలు మొక్కలు పెంచాలి పిల్లలు, తల్లులు అందరూ, హాజరయ్యే విధంగా చూడాలని తెలియజేశారు. తదనంతరం తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషక ఆహారం ఆకుకూరలు, తాజా కూరగాయలు, పాలు, పండ్లు, ఐరన్ కాల్షియం లభించే నువ్వులు, పల్లీలు, బెల్లం, తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు దేవేంద్ర, రామతార, నిర్మల, రాములమ్మ, మరియు తల్లులు,గర్భిణీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ కాంగ్రెస్ నాయకురాలుతో శ్రీశైలం గౌడ్

**మేడ్చల్ మల్కాజ్గిరి, విశాలభారతి:**

జిల్లా పరిధిలోని మేడ్చల్ పట్టణం డీసీసీ భవన్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ జాతీయ కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ అంజలీ నింబాల్కర్ని మర్యాదపూర్వకంగా కలిసి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సంబంధించిన కార్యక్రమాల పట్ల డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీ సుధీర్ రెడ్డి, నియోజకవర్గం ఇంచార్జ్ లు, మైనంపల్లి హనుమంత్ రావు, బండి రమేష్, తోటకూర వజ్రేశ్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, కోలన్ హనుమంత్ రెడ్డి, శ్రీరంగం, భూపతి రెడ్డి, నక్క ప్రభాకర్, విజయ రెడ్డితో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

తిరుమల శ్రీవారిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. వీఐపీ విరామ సమయంలో కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయ పండితులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

# క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

క్రీడా పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 69 వ ఎస్ జి ఎఫ్ మండల స్థాయి టోర్నమెంట్స్ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ రాథోడ్, జిహెచ్ ఎం భూక్య శ్రీను నాయక్, ఆదర్శ విద్యాలయ చైర్మన్ శ్రవణ్ కుమార్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్ రెడ్డి, జోనల్ స్థాయి సెక్రటరీ గాంగ్య నాయక్ పాల్గొన్నారు. రాజేంద్రనగర్ మండల స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 14 బాలురు, బాలికలు, అండర్ 17 బాలురు ,బాలికలు టోర్నమెంట్స్ ఈనెల 9,10,11 వ తేదీల్లో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో పోటీలు శివరాంపల్లి పాఠశాలలో నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు శనివారం అందజేశారు. ఈ టోర్నమెంట్ లో మొత్తం 210 టీమ్స్ వివిధ క్రీడాలలో పాల్గొన్నారు. క్రీడలలో పాల్గొని బెస్ట్ పెర్ఫార్మన్స్ కనబరచిన విద్యార్థులను జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. జోనల్ స్థాయి పోటీలు ఆదివారం నుంచి శివరాంపల్లి లో జరుగుతాయని జోనల్ సెక్రటరీ గాంగ్య నాయక్ తెలిపారు. ముగింపు కార్యక్రమంలో మండలం లో ని వివిధ సంఘాల నాయకులు పి ఆర్ టి యు అధ్యక్షులు కడుమూరి సుదర్శన్, ఎస్ టి యు అధ్యక్షులు కామిశెట్టి వెంకటయ్య, యుటిఎఫ్ అధ్యక్షులు యాదగిరి పాల్గొన్నారు.

# ప్రయాణికుల భద్రతే ముఖ్యం



- **ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు**
- **ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీపీ హనుమంత్ రావు**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

ప్రయాణికుల భద్రతను గుర్తుంచుకుని ఆటో డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జి. హనుమంత్ రావు అన్నారు. శనివారం మాధాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిదిలోని 250 మంది ఆటో డ్రైవరు లతో స్థానిక బుట్ట కన్వెన్షన్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధి గా హాజరై మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ లు ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటించి వాహనాలు నడపాలని పేర్కొన్నారు. అలాగే ప్రతి ఒక్కరు యూనిఫామ్ ధరించి, వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్,తమ వద్ద ఎల్లపుడు పెట్టుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు కేటాయించిన చోట్ల లోనే ఆటోలు పార్కింగ్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాదాపూర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ,ఎస్ఐ టీవీ రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు కృషిని అభినందిస్తున్న వాహనదారులు

**శేరిలింగంపల్లి, విశాలభారతి:**

మియాపూర్ జెపి నగర్ లో రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. జెపి నగర్, హెచ్ఎంటి స్వర్ణపురి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా వ్యాపార నిర్వహణ కోసం దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారు దీంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడి భానుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఈ సమస్యను గుర్తించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్ జెసిబి సహాయంతో ఆక్రమణలు తొలగించారు .ఎవరైనా తిరిగి ఫుట్ పాత్ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరమైన చేతులు తీసుకుంటామని హెచ్చరించారు. మియాపూర్ సెవెన్ హిల్స్ రెస్టారెంట్ వద్ద భారీ గుంతలు ఏర్పడడంతో టాపిక్కు ఇబ్బందులు ఎదురవుతున్నాయిని గుర్తించిన పోలీసులు ప్రత్యేక చర్య చొరవ తీసుకున్నారు. గుంతలు పూడ్చి రోడ్డుపై సాఫీగా ట్రాఫిక్ సాగేందుకు కృషి చేశారు. కోకోకోల రోడ్ నుంచి బాచుపల్లి వరకు ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. పోలీసులు తీసుకున్న చొరవ పై పలువురు అభినందిస్తున్నారు

# గెలుపు, ఓటమి నన్ను ప్రభావితం చేయలేవు

- **నా రాజకీయ ప్రయాణం కష్టాలతో కూడుకున్నది**
- **రాత్రుళ్ళు జెండాలు కట్టి.. పగటి పూట ధర్నాలు చేసి ఎదిగిన చరిత్ర నాది**
- **కులం పేరు చెప్పకొని రాలేదు.. జనం మధ్య నుంచే వచ్చాను**
- **మళ్ళీ రాష్ట్రంలో ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమే**
- **టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

**విశాలభారతి:**




సదాశివ పేట పట్టణంలోని కందకం రోడ్ పై ఆర్ అండ్ బి, మున్సిపల్ అధికారులతో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మల , జగ్గారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. కందకం రోడ్డు పొడవు 2.5 కిలో మీటర్లు, కల్వర్టులతో సహా దాదాపు పని పూర్తయింది, ఈశ్వర మంధిర్ దగ్గర ఏడు ఇళ్ళ తొలగింపు లో సమస్య ఉంది, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామంటే వారు ఒప్పుకోవడం లేదు. దానికి బదులుగా ఇంటి స్థలం, ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారని జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు అధికారులు. కందకం రోడ్ 2014 జనవరి లో ఉమ్మడి రాష్ట్రం లో మంజూరు అయితే, ఇప్పటి వరకూ ఎందుకు పూర్తి చేయలేక పోయారని అధికారులను ప్రశ్నించారు జగ్గారెడ్డి. ఉమ్మడి రాష్ట్రం లో కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్య మంత్రి గా , మున్సిపల్ మంత్రి మహీధర రెడ్డి ఉన్నప్పుడు, స్పెషల్ జి ఓ తెచ్చి 20 కోట్లు మంజూరు చేయడం జరిగింది.11 సంవత్సరాల లో 15 కోట్లు ఖర్చు చేశారు, ఇప్పటికీ పూర్తి చేయలేక పోయారు. 2014 లో నేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు కందకం రోడ్డు కోసం 20 కోట్లు తెస్తే ఇంకా 5 కోట్లు పనులు ఈ 11 ఏళ్లలో పూర్తి చేయలేక పోయారు.

2014లో నేను తెచ్చిన 20 కోట్ల జి ఓ కు, 11 ఏళ్ల తర్వాత మళ్లీ నేనే ఇప్పుడు రివ్యూ చేయాల్సి వస్తుందంటే సదాశివ పేట ప్రజలు ఆలోచించాలి. ఇన్నేళ్లు ఏం చేశారని అప్పుడు బి ఆర్ ఎస్ లో ఉన్న మాజీ మున్సిపల్ చైర్మన్ లు సుభాష్, విశ్వనాథ్ లను ప్రశ్నించిన జగ్గారెడ్డి. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దగ్గరకు వెళ్ళి ఎన్నో సార్లు అడిగామని, ఆ కుంపటి మనకెందుకు అని , వదిలేయమని చెప్పి పట్టించుకోలేదని జవాబిచ్చిన మాజీ చైర్మెన్ లు మంత్రి హరీష్ రావు దృష్టికి సైతం కందకం రోడ్డు విషయం తీసుకెళ్లామని , నిర్వాసితుల సమస్య తీర్చమని అడిగా మని జగ్గారెడ్డికి వివరించిన మాజీ మున్సిపల్ చైర్మన్ లు సుభాష్, విశ్వనాథ్ లు నిర్వాసితుల కు డబుల్ బెడ్ రూం లు తప్పా వేరే ఏ పరిహారం ఇచ్చేదిలేదని హరీష్ రావు చెప్పాడని , కందకం రోడ్ సమస్య ను ఇటు చింతా ప్రభాకర్, అటు హరీష్ రావు పట్టించుకోలేదని అన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ప్లంబర్ ఆత్మ హత్య

**ఫలక్ నుమ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

**హైదరాబాద్, విశాలభారతి:**



ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ ప్లంబర్ తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడిన ఘటన ఫలక్ నుమ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగింది. ఫలక్ నుమ ఇన్ స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం... పాతబస్తీ నవాబ్ సాహెబ్ కుంట కు చెందిన మొహమ్మద్ షాదాబ్ (35) వృత్తి రీత్యా ప్లంబర్. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. గత కొన్ని రోజులుగా షాదాబ్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం షాదాబ్ తన ఇంటిలో తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఫలక్ నుమ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అతని మృతదేహన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ కేసును ఫలక్ నుమ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

# కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

- **సంఘటన్ సృజన్ అభియాన్**
- **శక్తిసింగ్ గోయల్**
- **ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**హైదరాబాద్, విశాలభారతి:**



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంఘటన్ సృజన్ అభియాన్ - తెలంగాణ కార్యక్రమంలో భాగంగా, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ గాంధీ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి అధ్యక్షత వహించగా, ఏఐసీసీ అబ్జర్వర్ శక్తిసింగ్ గోయల్ , పీసీసీ అబ్జర్వర్ మరియు ఎంపీ మల్లు రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా పీసీసీ అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, ప్రజలలోంచి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారానే ఎంపిక చేయడం వంటి అంశాలపై విస్తృత చర్చ జరిగింది.ఏఐసీసీ అబ్జర్వర్ శక్తిసింగ్ గోయల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీముఖ్య ఉద్దేశ్యం ప్రజల నుండి వచ్చిన నాయకత్వాన్ని ప్రజల ద్వారానే ఎంపిక చేయడం. ఈ స్ఫూర్తితో ఏఐసీసీ అబ్జర్వర్లు తెలంగాణలోని ప్రతి జిల్లాలో స్థానిక నాయకులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరిస్తున్నారు, అని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల ఎవరైనా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి నాయకుడితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటాం. ఆ సమాచారాన్ని టీపీసీసీ మరియు ఏఐసీసీకి పంపిస్తాం. ఈ విధానం ద్వారా పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతోంది, అని చెప్పారు. పీసీసీ అబ్జర్వర్ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ. ఈ కార్యక్రమం పార్టీకి కొత్త ఉత్సాహం తెస్తుంది. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తుంది. ప్రజలే నాయకులను నిర్ణయించాలి అన్న స్ఫూర్తితో పార్టీ ముందుకు సాగుతుంది, అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, ఇతర కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

- **టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి**

**తొర్రూర్, విశాలభారతి:**

తొర్రూర్ డివిజన్ కేంద్రంలో టిపిటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీపిటిఎఫ్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సమావేశంలో విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. సర్వీస్ లో ఉన్న సీనియర్ టీచర్స్ కు టెట్ అవసరం లేకుండా ప్రభుత్వం సుప్రీంకోర్టులో త్వరలో రివ్యూ పిటిషన్ వేయాలని,కామన్ సీనియారిటీతో ఎల్ ఎఫ్ ఎల్ ప్రమోషన్ ఉండాలనీ, రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలోని ఎస్ జి టి సర్ ప్లేస్ పోస్టులను తగ్గించి హైస్కూల్ లో పి ఈ టి పోస్టులు ఇస్తే.. ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం అవుతాయి.కావున అవే పోస్టులతో ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయున్ని,ఒక ప్రధానోపాధ్యాయున్ని మరియు ఒక వ్యాయామ ఉపాధ్యాయున్ని నియమించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసింహులపేట టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు క్రాంతి కుమార్, దంతాలపల్లి టి పి టి ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సురేష్, టిపిటిఎఫ్ బాధ్యులు వెంకట్రామ నరసయ్య, ఏ యాకయ్య, పాషా, బొమ్మ శ్రీనివాస్, కే ఆంజనేయులు, భోగ సంపత్, కే సురేష్, అయితా కృష్ణ, మాదాసు రాములు, జి సంతోష్,ఎం యాకన్న,తదితరులు పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి



- **స్థానిక పోరులో ఒంటరిగానే పోటీ**
- **నాగం వర్షిత్ రెడ్డి బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షులు**

**చౌటుప్పల్, విశాలభారతి:**

భారతీయ జనతా పార్టీ చౌటుప్పల మున్సిపల్ శాఖ అధ్యక్షులు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో చౌటుప్పల మున్సిపల్ ముఖ్య నాయకుల మరియు బూత్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశం హోటల్ హైవే 9 నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్:నాగం వర్షిత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తదనంతరం వారు మాట్లాడుతూ త్వరలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీకి ఎవరితోటి ఎలాంటి పొత్తులు లేకుండా చౌటుప్పల్ అన్ని వార్డులలో ఎంపీటీసీ గాను సర్పంచులకు గాను మరియు కౌన్సిలర్లకు గాను ఒంటరిగా పోటీ చేస్తుంది. అదేవిధంగా పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆర్ ఆర్ ఆర్ రోడ్డు విస్తరణలో నీ వాటా లేకుంటే నీ బంధువుల వాటా లేకుంటే రాజీనామా చేసి ప్రజల వద్దకు వెళ్లి గెలవాలని,స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి నీ డిమాండ్ చేశారు.మోదీ సుస్థిర పాలనకు స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపికి జనం పట్టం కట్టడానికి రెడీగా ఉన్నారు అని అన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల విషయంలో హైకోర్టు స్టే విధించడంలో బిజెపిపై దుమ్మెత్తి పోస్తున్న కాంగ్రెస్ శ్రేణులు తీరు మార్చుకోవాలని అన్నారు.ఈ కార్ రేసులో కేటీఆర్ ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదు అని ప్రశ్నించారు.రమణ గోని శంకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక గూటి పక్షులే అందుకే వారిని అరెస్టు చేయడం లేదు.పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన మాట్లాడుతూ కవితక్క రెజిగ్నేషన్ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యాక్సెప్టు చేయడం లేదు అని అన్నారు.స్పీకర్ ఫార్మేట్ లో ఇయ్యలేదా అని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య,సీనియర్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి,మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు,లింగోజిగూడెం మాజీ సర్పంచ్ రమణ గోని దీపిక,జిల్లా పార్టీ మాజీ కార్యదర్శి ఆలే చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



# గ్రాడ్యుయేట్ ఆర్గానిక్ నాన్‌వెజ్ మార్ట్ ప్రారంభం

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:**

ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని హయత్‌నగర్ డివిజన్ సి.ఎస్.ఆర్ కాలనీలో "గ్రాడ్యుయేట్ ఆర్గానిక్ నాన్‌వెజ్ మార్ట్" ఘనంగా ప్రారంభమైంది.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మల్ రెడ్డి రామిరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, మన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, చెన్నగౌని రవీందర్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. నిర్వాహకులు మిరియాల గణేష్, గుర్రం వేణు మాట్లాడుతూ —మా మార్ట్ ప్రత్యేకత ఏమిటంటే, గొర్రెలు, పొట్టేళ్లు పెంచుకునే వారికి లైవ్ స్టాక్ ను సరసమైన ధరల్లో అందించడమే కాకుండా, నాటు కోళ్లు వంటి శుద్ధమైన ఆర్గానిక్ ఉత్పత్తులను అందించడం మా లక్ష్యం అని తెలిపారు.మార్ట్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట ప్రభాకర్, ముత్యాల రాజశేఖర్, మనోజ్ ముదిరాజ్, చెన్న గౌని రవీందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, పన్యాల జైపాల్ రెడ్డి తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సుభాషిణి చిత్రపటానికి నివాళులు

**మాజీ మంత్రి సత్యవతి రాథోడ్**

**కురవి, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలోని కురవి మండల మోదుగులగూడెం గ్రామంలో శోకచ్ఛాయలు నెలకొన్నాయి. గ్రామానికి గౌరవనీయురాలు, దాతృత్వగుణం కలిగిన ఎర్రం రెడ్డి కేశవ రెడ్డి సతీమణి సుభాషిణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, నేడు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ స్వయంగా గ్రామానికి చేరుకొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. సుభాషిణి సేవాస్ఫూర్తిని స్మరించుకుంటూ ఆమె "సామాజిక సేవలో సుభాషిణి పాత్ర మరువలేనిది. పేదలకు తోడుగా నిలిచి అనేకమందికి ఆశ్రయం ఇచ్చారు" అని తెలిపారు. తరువాత ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రావుల రవిచంద్ర రెడ్డి, ఐలి నరహరి గౌడ్, బొడ శ్రీను, గ్రామ సర్పంచ్ సత్యమూర్తి, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో విచారం వ్యక్తం చేస్తూ సుభాషిణి గారి జ్ఞాపకాలను స్మరించారు.




# జిమ్నాస్టిక్స్‌లో 3 అంతర్జాతీయ రికార్డ్స సాధించిన రోహన్

**అభినందించిన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**హైదరాబాద్, విశాలభారతి:**

ఏడు సంవత్సరాల వయస్సులోనే జిమ్నాస్టిక్స్‌లో మూడు అంతర్జాతీయ రికార్డ్స్ సాధించిన రోహన్‌ను క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. ఈ మేరకు శనివారం బంజారాహిల్స్‌లోని మంత్రి అధికారిక నివాసంలో మంత్రి శ్రీహరిని క్రీడాకారుడు రోహన్ సహా అతని తల్లి దండ్రులు సురేష్, సృజన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రోహన్‌ను దుశ్శాలువతో మంత్రి శ్రీహరి సత్కరించి, అభినందించారు. రోహన్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. త్వరలోనే క్రీడాకారుల కోసం ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రతిభవంతులైన క్రీడాకారులందరిని గుర్తించి, వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీహరి చెప్పారు.



# టీహబ్‌తో త్వరలో కేయూ అవగాహన ఒప్పందం : వీసీ ప్రతాప్‌రెడ్డి



**హనుమకొండ, విశాలభారతి:**

కాకతీయ యూనివర్సిటీ టీహబ్ తో త్వరలో అవగాహన ఒప్పందం చేసుకోనున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కేయూ ఫార్మసీ కళాశాల స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రుసా వంటి సంస్థల మద్దతుతో విశ్వవిద్యాలయ ఫార్మసీ కాలేజీ మరింత అభివృద్ధి చెందుతోందని వెల్లడించారు. ఇప్పటివరకు ఈ విశ్వవిద్యాలయం నుంచి 600 మందికి పైగా పీహెచ్‌డీలు పూర్తిచేసినట్లు చెప్పారు. వారిలో చాలామంది పరిశోధకులు, ఉపాధ్యాయులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, వ్యాపారవేత్తలు, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్నతస్థాయిలలో పనిచేస్తున్నారని వివరించారు. డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి హ్యాకథాన్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కళాశాలలో పని చేసిన పూర్వ ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యా, ప్రయోగశాలల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల మద్దతు ప్రశంసనీయమన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల వారసత్వాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశంసించారు. యూనివర్సిటీ తన పేరు, కీర్తిని తిరిగి తీసుకురావాలన్నారు. పూర్వవిద్యార్థుల సావనీర్, రెండు పుస్తకాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.కృష్ణవేణి సహా అనేక మంది అధ్యాపకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో జిల్లా అధ్యక్షుల పాత్ర చాలా కీలకం

**కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కంటోన్మెంట్, విశాలభారతి:**

కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల పాత్ర చాలా కీలకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఎంపి కలో భాగంగా నారాయణ పేట్, మహబూబ్ నగర్ జిల్లాలకు టిపిసిసి పరిశీల కులుగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ,తెలంగాణ ఫిషరీస్ కార్పోరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ నియ మితులయ్యారు. ఏఐసిసి పరిశీలకులుగా విచ్చేసిన ఎమ్మెల్సీ నారాయణస్వామి తో వారు నారాయణ పేట లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయ కులతో సమావేశమై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల అభిప్రా యాలను సేకరించారు. గతంలో జిల్లా అధ్య క్షులను డైరెక్టుగా నామినేట్ చేసే వారని, కానీ అహ్మదాబాద్ ప్లీనరీలో ఎఐసిసి అగ్ర నాయకులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జిల్లా అధ్య క్షులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభిప్రాయాల ద్వారా నియ మించా లని, కార్యకర్తలకు, నాయకులకు అందు బాటులో ఉండే వ్యక్తులను జిల్లా అధ్యక్షులుగా నియమించాలని చెప్పారని, దానికి అనుగుణంగా ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే తెలంగాణ రాష్ట్రానికి ఏఐసిసి పరిశీలకులను నియ మించారని అన్నారు. వారికి అనుబంధంగా టిపిసిసి రాష్ట్ర నాయకులను పరిశీలకులుగా నియ మిం చిం దని, తామంతా క్షేత్రస్థాయిలో పర్యటించి కార్య కర్తలతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అభిప్రా యాలను టీపీ సీసీకి తెలియజేస్తామని, టిపిసిసి అధ్యక్షులు ఏఐసీసీకి నివేదికను అందజే స్తారని చెప్పారు.

# వాలీబాల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు సన్మానం



**జోనల్ లెవెల్ వాలీబాల్ అండర్ 14 బాలురు విభాగంలో రెండవ స్థానం**

**ఇబ్రాహీంపట్నం, విశాలభారతి:**

జోనల్ లెవెల్ అండర్ 14 బాలుర విభాగంలో వాలీబాల్ లో యాచారం మండలంలోని నందివనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ కు కాంగ్రెస్ పార్టీ నాయకుడు కొంగరి లింగం ఆధ్వర్యంలో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. శాలువలతో విద్యార్థులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కొంగరి లింగం మాట్లాడుతూ క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. స్పోర్ట్స్ పరంగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషన్ నాయక్, వెంకటేశ్వర్లు, రమేష్ గ్రామస్తులు కొండాపురం శివకుమార్, పి. దశరథ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు




**తొర్రూరు, విశాలభారతి:**

లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామ నరసయ్య ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.పిడిజి లయన్ ముచ్చ రాజిరెడ్డి, లయన్ తమ్మెర ఉమా విశ్వేశ్వర రావు, క్లబ్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ లయన్ పెరుమండ్ల రమేష్ కుమారుడు వర్షిత్ గౌడ్ ల పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు.అనంతరం వారి ఆర్థిక సహకారంతో తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, రోహిత్ హాస్పిటల్ వద్ద అన్నప్రసాద వితరణ, రిక్షా కాలనీలో 20 కుటుంబాలకు చీరలు, టీ షర్టు టవల్స్ పంపిణీ, శ్రీ వెంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాల, ఎస్సీ కాలేజీ హాస్టల్ లో విద్యార్థినిలకు పరీక్ష ప్యాడులు, రూ.6 వేల విలువచేసే 3 సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. గోశాల నిర్మాణానికి రూ.3 వేలు అందించారు. చిట్యాల జెడ్పి హెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేసి మొక్కలు నాటారు. వివిధ వ్యాధుల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పిడిజి లు లయన్ డాక్టర్ కె రాజేందర్ రెడ్డి, లయన్ తమ్మెర విశ్వేశ్వర రావు ,ఆర్ సి దామేర సరేష్, జోన్ చైర్మన్ చిదిరాల నవీన్, క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి,క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఒక చుక్కనూ వదలం

- **కాళేశ్వరం జలాలు లేకున్నా పంటలు పండినయ్**
- **హరీశ్ రావు తప్పుడు ఆరోపణలు మానుకోవాలి**
- **భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**వరంగల్, విశాలభారతి:**



తెలంగాణకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీటినీ వదలమని, కృష్ణా జలాలను వదులుకునేందుకు ప్రభుత్వం

సిద్ధంగా లేదని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి చనిపోగా ఆయనను పరామర్శించేందుకు శనివారం హన్మకొండకు వచ్చిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి సీతక్కతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కృష్ణా నదిలో నికర జలాలైనా, మిగులు జలాలైనా, వరద జలాలైనా సరే.. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటాలో ఒక చుక్క నీరు కూడా వదులుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ లో తెలంగాణ వాదనలు గట్టిగా వినిపించబోతున్నామన్నారు. కృష్ణానదిలో 512 టీఎంసీల నీటిని ఏపీకి ఇచ్చేందుకు బీఆర్ఎస్ ఒప్పుకుందని ఆరోపించారు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తగా ఉన్నప్పటికీ తెలంగాణలో అత్యధిక వరి పంట పండిందని తెలిపారు. గోదావరి కృష్ణాలో మోసం జరిగిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో హరీశ్ రావు తెలంగాణ ప్రభుత్వాన్ని బదనాం చేయడం సరికాదని, ఆయన తీరు మార్చుకోవాలని సూచించారు. ఏపీ సర్కారు చేపట్టే బనకచర్లకు తమ ప్రభుత్వం వ్యతిరేకమని, ఆల్మట్టి ఎత్తు పెంచడాన్ని వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి హోదాలో కృష్ణా ట్రిబ్యునల్ కి హాజరైన ఏకైక మంత్రిని తానేనని ఉత్తమ్ స్పష్టం చేశారు. కృష్ణా గోదావరి నీటి హక్కును కాపాడుకునే చిత్తశుద్ధి తెలంగాణ ప్రభుత్వానికి ఉందని, రాష్ట్ర నీటి హక్కులను ఒక చుక్క కూడా వదులుకోమని, కేంద్రానికి ఇదే విషయాన్ని పదే పదే చెప్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే తెలంగాణ రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. దేశంలోనే ఎక్కువ పంటను ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తెలిపారు. వరంగల్ లో ఎయిర్‌పోర్ట్ కట్టి నగరాన్ని ఓ స్థాయికి తీసుకెళ్తున్నామని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ ప్రాజెక్ట్‌కు అనుమతులు సాధిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు దొంతి మాధవ రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
హైదరాబాద్
ఆదివారం
12 అక్టోబర్ 2025
CINEMA

# ఒకే నెలలో 3 సినిమాలు..



తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి.కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించు కోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ Genie సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి.



# కిరణ్ అబ్బవరం వెబ్‌సిరీస్ జోనర్ ఇదే

కథను నమ్మి సినిమాలు చేసే టాలీవుడ్ యాక్టర్లలో ఒకడు కిరణ్ అబ్బవరం. ఈ టాలెంటెడ్ యాక్టర్ ప్రస్తుతం కే-ర్యాంప్ సినిమాలో నటిస్తున్నాడని తెలిసిందే. యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌గా రాబోతున్న ఈ మూవీ అక్టోబర్ 18న దీపావళి ట్రీట్‌గా థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా కిరణ్ అబ్బవరం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు.కాగా ప్రమోషనల్ ఇంటర్వ్యూలో కిరణ్ అబ్బవరం ఆసక్తికర విషయమొకటి షేర్ చేసుకున్నాడు. కోలీవుడ్ స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్‌తో కలిసి పనిచేసే అవకాశమున్నట్టు కిరణ్ అబ్బవరం హింట్ ఇచ్చేశాడు. తమిళ దర్శకుడు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కించనున్నాడని.. త్వరలోనే ప్రొడక్షన్ హౌస్‌తోపాటు ఇతర వివరాలు వెల్లడిస్తామని కిరణ్ చెప్పాడని కథనం ఒకటి నెట్టింట ఊపందుకుంది. అనిరుధ్ రవిచందర్ అంటే మ్యూజిక్ ఎంత ఎనర్జిటిక్‌గా ఉంటుందని తెలిసిందే. ఇదే నిజమైతే అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బీజీఎం కిరణ్ అబ్బవరం కెరీర్‌కు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. ఇదే కాకుండా కిరణ్ అబ్బవరం ఓ వెబ్ సిరీస్‌ను కూడా చేయబోతుండగా ఈ ప్రాజెక్ట్ పొలిటికల్ డ్రామా నేపథ్యంలో ఉంటుందని చెప్పాడు. మరోవైపు శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో సినిమా కూడా చేయబోతన్నానని చేప్పాడు.

# నేషనల్ క్రష్‌గా రష్మిక ఔట్.. ఇంటర్నేషనల్ క్రష్ గా మరో కన్నడ బ్యూటీ..!



కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన మరో స్టార్ హీరోయిన్ ఇప్పుడు తన హవా చాటుతుంది. 'సప్త సాగరదాచె ఎల్లో' సినిమాతో పరిచయమై, 'కాంతార ఛాప్టర్ 1'లో కనకవతి పాత్రలో నటించిన రుక్మిణి వసంత్ ఇప్పుడు నేషనల్ స్థాయిని దాటి ఇంటర్నేషనల్ క్రష్‌గా మారిపోయారు. 'కాంతార ఛాప్టర్ 1' బ్లాక్‌బస్టర్ విజయంతో ఆమె పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. హోంబాలే ఫిల్మ్స్ నిర్మించిన కాంతార చాప్టర్ 1 చిత్రం విడుదలైన వారం రోజుల్లోనే రూ. 500 కోట్లకు పైగా వసూలు చేసి సంచలనం సృష్టించింది. కన్నడ సినిమా రంగంలో ఇదొక అరుదైన రికార్డు. అద్భుతమైన కథ, దృశ్యకావ్యం లాంటి విజువల్స్‌తో పాటు, రుక్మిణి వసంత్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటి వరకు 'నేషనల్ క్రష్'గా రష్మిక మందన్న పేరు వినిపిస్తుండగా, ఇప్పుడు ఆ స్థానం రుక్మిణికి చెందిందని నెటిజన్లు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇక ఆమెను కర్ణాటక క్రష్, కన్నడ క్రష్, ఇంటర్నేషనల్ క్రష్ అంటూ పిలుస్తున్నారు. రష్మిక మందన్నపై ఇటీవల కన్నడ ప్రేక్షకుల్లో కొంత వ్యతిరేకత నెలకొన్న సంగతి తెలిసిందే. అదే సమయంలో రుక్మిణి వసంత్ 'కాంతార 2' విజయంతో వెలుగులోకి రాగా ఆమెను రష్మికకు బదులుగా ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఇక రష్మిక, విజయ్ దేవరకొండ ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నారన్న వార్తల నడుమ, ఆమె వెనుకబడతుందన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం రుక్మిణి వసంత్ తమిళ, కన్నడ సినిమాలతో బిజీగా ఉన్నారు. త్వరలోనే తెలుగులోనూ ఎంట్రీ ఇవ్వనున్నట్టు సమాచారం. 'కాంతార 2 ' విజయంతో ఆమె కెరీర్‌లో కొత్త అధ్యాయం మొదలైందనడంలో సందేహమే లేదు. ఇక రష్మిక మందన్న స్థాయిని రుక్మిణి వసంత్ చేరతారా? లేక ఈ క్రేజ్ తాత్కాలికమా? అన్నది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.



# దీపికా ప్లేస్ లో అలియా..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన కల్కి 2898 ఏడి సినిమా భారీ విజయాన్ని అందుకున్న విషయం తెల్సిందే. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ నిర్మించింది. ఇక ఈ చిత్రంలో దీపికా పదుకొనే హీరోయిన్ గా నటించింది. కల్కి కి సీక్వెల్ ఉందని మేకర్స్ ఎప్పటి నుంచో ప్రకటించారు. ఈ మధ్యనే అధికారికంగా కూడా కల్కి 2 పట్టాలెక్కనుందని తెలిపారు. ఇక ఈ నేపథ్యంలోనే కొన్ని కారణాల వలన కల్కి 2 నుంచి దీపికాను తొలగించినట్లు మేకర్స్ ప్రకటించారు.దీపికాను తొలగించడం వెనుక చాలా కారణాలు ఉన్నాయి. అవి చాలామందికి కూడా తెలుసు. ఇక అదంతా పక్కన పెడితే.. దీపికా స్థానాన్ని భర్తీ చేసే మరో ముద్దుగుమ్మ ఎవరు..? గత కొన్ని రోజులుగా ఇదే వార్త సోషల్ మీడియాను షేక్ చేస్తుంది. ఇక తాజాగా ఆ ముద్దుగుమ్మ అలియా భట్ అని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీపికా స్థానానికి అలియా అయితే పర్ఫెక్ట్ అని మేకర్స్ ఆమెను సంప్రదించారని టాక్. అలియా అనేసరికి ప్రభాస్ ఫ్యాన్స్ పెదవి విరుస్తున్నారు. ఆరడుగుల ప్రభాస్ పక్కన దీపికానే చిన్నగా కనిపించింది. ఇప్పుడు అలియా అయితే మరీ పొట్టిగా కనిపిస్తుంది. అసలు డార్లింగ్ పక్కన అలియా కనిపిస్తుందా.. ? అని మాట్లాడుకుంటున్నారు. మొదటి పార్ట్ లో ప్రభాస్ - దీపికా మధ్య సీన్స్ లేవు. సెకండ్ పార్ట్ లో కచ్చితంగా ఆ రెండు పాత్రల మధ్య కీలక సన్నివేశాలు ఉంటాయని చెప్పకొచ్చారు. ఇక ఇప్పుడు అలియా అయితే మరీ ప్రభాస్ ముందు చిన్నపిల్లలా ఉంటుందేమో అని అంటున్నారు. ఆమె పల్స్ లో అనుష్కనో, ఐశ్వర్య రాయ్ నో తీసుకుంటే బావుంటుందని చెప్పకొస్తున్నారు. మరి ఇందులో ఎంతవరకు నిజముంది అనేది తెలియాల్సి ఉంది.

# అనుపమ డేటింగ్ రూమర్స్ పై మరోసారి చర్చలు!



టాలెంటెడ్ మలయాళీ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ ఇటీవల తమిళ సినిమాల్లో బిజీగా మారింది. ప్రేమమ్ చిత్రంతో హీరోయిన్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి దాదాపు దశాబ్దం పూర్తి చేసుకున్న అనుపమ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుసగా అవకాశాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకుంది. ఆమె క్యూట్ లుక్స్, కర్లీ హెయిర్, నేచురల్ చామ్ కు భారీ ఫ్యాన్ బేస్ ఏర్పడింది. అయితే అనుపమ నటనతో పాటు పర్సనల్ లైఫ్ గురించి కూడా అభిమానులలో పెద్ద చర్చే నడుస్తోంది. గతంలో అనుపమకి సంబంధించి పలు రిలేషన్‌షిప్ రూమర్స్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఇటీవల మరోసారి అనుపమ ప్రేమ వ్యవహారం మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.తమిళ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్‌తో అనుపమ పీకల్లోతు ప్రేమలో ఉందనే వార్తలు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అనుపమ – ధ్రువ్ కలసి నటించిన తాజా తమిళ చిత్రం "బైసన్", లవ్ అండ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సినిమా షూటింగ్ సమయంలోనే ఈ జంట మధ్య మంచి ఫ్రెండ్‌షిప్ బాండింగ్ ఏర్పడిందని, అది రిలేషన్‌షిప్‌గా మారిందని కొంతమంది కామెంట్ చేస్తున్నారు. వీరిద్దరూ తరచూ కలిసి కనిపించడం, షూటింగ్ తర్వాత కూడా వీరు క్లోజ్‌గా మూవ్ అవుతుండడం, వాటికి సంబంధించి బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు ఈ ఊహాగానాలకు మరింత బలాన్నిచ్చాయి.



కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్దుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి.చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయొలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

# సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు..



# నిన్న సాయిపల్లవి... నేడు ప్రియాంక

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సినీ సెలబ్రిటీల పాలిట శాపంగా మారింది. నకిలీ ఫొటోలు, వాయిస్‌లను ఎఐ క్రియేషన్‌లో క్రియేట్ చేసి తారలకు చుక్కలు చూపిస్తున్నారు. వీటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతున్నాయి. తారల పాలిట ఇది పెద్ద ఇబ్బందిగా మారింది. ఇటీవల చాలామంది తారలు ఎఐ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా సాయిపల్లవికి సంబంధించిన వెకేషన్ ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేశాయి. అవి నిజం కావని, ఎఐలో క్రియేట్ చేసిన ఫొటోలని ఆమె తర్వాత తెలిపింది. ఇప్పుడేమో 'ఓజీ' చిత్రంతో విజయం అందుకున్న నటి ప్రియాంకా అరుల్ మోహన్‌కు కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైంది. తనకు సంబంధించి ఎఐలో సృష్టించిన కొన్ని ఫేక్ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై ఆమె స్పందించారునా పేరుతో ఎఐలో సృష్టించిన నకిలీ చిత్రాలు ప్రచారం అవుతున్నాయి. దయచేసి వాటిని షేర్ చేయడం ఆపండి. ఏఐ లాంటి టెక్నాలజీని సృజనాత్మకత కోసం ఉపయోగించాలి కానీ ఇలా తప్పదారి పట్టించడానికి కాదు. 'ఇలాంటివి క్రియేట్ చేసి ఏం సాధిస్తున్నాం.. సమాజానికి ఏం చెబుతున్నాం అనేది ఆలోచించండి' అంటూ ఆమె మండిపడ్డారు. ఇటీవల విడుదలై విజయం సాధించిన ఓజీ చిత్రంలో ఆమె కన్మణి పాత్రలో మెప్పించింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.